# దూరం

చంద్రవదన్, మనసు మనసులో లేదు. శైలజ కూడా దాదాపు అదే స్థితిలో వుంది. స్వదేశం వస్తున్నామన్న సంతోషంలేదు. వాళ్ళలో ఎప్పటిలా దిగులు చోటు చేసుకుంది ఆ స్థానంలో.

కారణం ఇంటి దగ్గర ఎలాంటి వార్త వినాల్సివస్తుందోననే భయం కరుడు కట్టుకుని వుంది ఇద్దరిలో. శైలజ అధికంగా బాధపడుతోంది.

బస్సులో విజయవాడ వస్తున్నారు ఇద్దరూ. ఆ బస్సులో ఎక్కడానికి ముందు, గంటన్నర క్రితమే బోయింగ్ విమానంలోంచి దిగారు హైదరాబాద్ ఏర్‌పోర్టులో. ఏర్‌పోర్ట్‌నించి సరాసరి బస్ డిపో చేరుకున్నారు విజయవాడ వెళ్ళే రైలు ఆ సమయంలో లేదు కాబట్టి

అంతకు ముందు రోజే చంద్రవదన్, శైలజ అమెరికాలోని న్యూయార్క్ నుంచి బయలుదేరారు. విజయవాడ నుంచి కేబుల్ వచ్చింది శైలజ తండ్రి శివరామయ్యకి హార్ట్ అటాక్ రెండోసారి వచ్చిందని, వెంటనే బయల్దేరమనీ.

న్యూయార్క్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్ మిత్రుడొకడు చెప్పాడు చంద్రవదన్‌కి రెండోసారి ఎటాక్ వస్తే హార్ట్ పేషెంట్ బతకటం అరుదని ఓసారి మాటల్లో. శివరామయ్యకి ఓసారి హార్ట్ ఎటాక్ వచ్చిందన్న సంగతి తెలుసు ఇద్దరికీ. శైలజ కేబుల్ చదవగానే పెద్ద పెట్టున ఏడవ సాగింది చిన్నపిల్లలా. చంద్రవదన్‌కి కూడా ఏడుపు ముంచుకు వచ్చింది కాని తనను తాను సంబాళించుకుని భార్యని ఓదార్చాడు.

వెంటనే చంద్రవదన్ ప్రొఫెసర్‌గా పనిచేసే యూనివర్సిటీకి వెళ్ళి నెల రోజుల శెలవు సేంక్షన్ చేయించుకున్నాడు పరిస్థితి వివరించి.

అదృష్టవశాత్తు టిక్కెట్స్ దొరికాయి. కాని అప్పటికే ఓ రోజు దాటింది. ఒకవేళ నిజంగా ఏదైనా ప్రమాదం సంభవించి వుంటే మాత్రం బహుశ తాము చేరుకునేసరికి అంతా అయిపోతుంది.

"ఇంత ఆలస్యం చేశారేమర్రా?" అంటారు పెద్దవాళ్ళు.

శైలజ తన తండ్రిని, తను తన మామయ్యని కేవలం ఇక ఫోటోలో మాత్రమే చూసుకోవాలి అనుకున్నాడు చంద్రవదన్.

బొంబాయిలో ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్ రన్‌వే మీద ఆగింది అమెరికా నుంచి వచ్చిన వాళ్ళ విమానం. బేగేజ్ చెక్, కస్టమ్స్ ఫార్మాలిటీస్ మొదలైనవన్నీ అవడానికి రెండు గంటలు పట్టింది.

ఈలోగా హైద్రాబాద్ ఫ్లయిట్‌కి రెండు టిక్కెట్లు బుక్ చేశాడు చంద్రవదన్. బొంబేలో విమానంలోంచి దిగిన ఏడు గంటల తర్వాత హైద్రా బాద్ వెళ్ళే విమానం బయలుదేరింది. దాదాపు గంటన్నర తర్వాత హైద్రా బాద్ చేరుకున్నారు. విమానంలో ఇద్దరూ కాఫీ తప్ప మరేం తీసుకోలేదు. తినబుద్ధి కాలేదు ఇద్దరికీ.

హైద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా వైజాగ్, భువనేశ్వర్ వెళ్ళే విమానం మిట్ట మధ్యాహ్నం పన్నెండింటి కుందని చెప్పింది ఏర్ హోస్టెస్. అంటే మధ్యాహ్నటిదాకా ఆగాలి. ఇంకా ముందే చేరుకోవాలంటే బస్సులో వెళ్ళడం మంచిదని సలహా ఇచ్చింది.

బస్సులో బయలుదేరారు. బస్‌స్టాండ్ దగ్గరలో వున్న ఓ టెలిగ్రాఫ్ ఆఫీసు నుంచి టెలిగ్రాం ఇచ్చాడు చంద్రవదన్ తాము ఇండియా చేరు కున్నట్లుగా.

విజయవాడ బస్‌స్టాండ్‌లో దిగారు తెల్లవారుఝామున నాలుగున్నరకు. ఆరింటికుంది ముదునూరు వెళ్ళే బస్సు. దాదాపు ఏడున్నరకు పేసెంజర్

బస్సులో దిగారు ముదునూరులో. అయిదు నిమిషాల్లో ఇల్లు చేరుకున్నారు. ఆ అయిదు నిమిషాలు భార్యాభర్తలిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. గుండెలు బిగబట్టుకుని నడిచారు. ఎలాంటి చెడు వార్త వినడానికీ ఇద్దరూ సిద్ధమయిలేరు. ఆ ధైర్యం లేదు వాళ్ళిద్దరిలో.

"శైలజా వాళ్ళొచ్చారు" శైలజ అన్నయ్య పెద్దగా అరిచాడు ఇంట్లో వాళ్ళకి వినబడేటట్లుగా. తర్వాత చేతిలోని సిగరెట్‌ని పారేసి లేచి నిల బడ్డాడు సంతోషంగా.

"ఎలా వుంది మామయ్యకి ?" అడిగాడు చంద్రవదన్ వణికే కంఠంతో.

"ఇప్పుడు ఫర్వాలేదు."

అంటే గండం గడిచినట్లేనా ?" అడిగింది శైలజ.

తల వూపాడు శైలజ అన్నయ్య.

ఇద్దరూ గట్టిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఒకరి వంక మరొకరు చూసుకున్నారు. ఇద్దరి మొహాల్లో అనుకో కుండా చిరునవ్వు ప్రవేశించింది.

"ఏమే. బాగా తెల్లబడి లావయ్యావే ? అమెరికా నీళ్ళు బాగా పడినట్లున్నాయే ?"

శైలజ చెల్లెలు అక్క చేతిని పట్టుకుని ఆప్యాయంగా అడిగింది.

"నీకు గుడివాడ నీళ్ళు పడినట్లున్నాయి. నువ్వేం తక్కువ లేవు" అన్నాడు చంద్రవదన్ నవ్వుతూ.

"నువ్వేం వెనకేసుకు రానక్కరలేదు నీ భార్యని. ఇద్దరూ లావ య్యారు" మరదలు వెక్కిరించింది బావని.

లోపలకి వెళ్ళారు అంతా.

"నాన్నేరీ ?" అడిగింది శైలజ తండ్రి గదిలోకి వెళ్ళి, ఆయన పందిరి పట్టెమంచం ఖాళీగా వుండడం చూసి.

"ఇంకా ఇంటికి తీసుకురాలేదు. ఆస్పత్రిలోనే వున్నారు."

"బెజవాడా ?"

"అవును. అమెరికన్ ఆస్పత్రిలో."

"అమ్మ కూడా అక్కడే వుందా ?"

"అమ్మ, తమ్ముడు, పిన్ని ముగ్గురూ అక్కడే వున్నారు"

"మాకా సంగతి తెలిస్తే అపే వెళ్ళే వాళ్ళం ఇక్కడికి రాబోయే ముందు" అన్నాడు చంద్రవదన్.

"అసలేమయింది ?" శైలజ అడిగింది.

"ఆ రోజు రాత్రి భోజనం చేశాక చుట్ట అంటించారు. తర్వాత అమ్మని పిల్చారు. వెళ్ళిచూస్తే ఏముంది. మొహమంతా పాలిపోయి వుంది. ఒంటినిండా చెమటలు పట్టేశాయి. అమ్మకి భయంవేసి అందరినీ పిలిచింది. గుండెనొప్పిగా వుందని చెప్పారు నాన్నగారు. అదృష్టం. ఎరువుల వ్యాపారం చేసే ఆయన ఎందుకో మదునూరు వచ్చారు. సంగతి తెలిసి కారు తీసుకువచ్చారు. అర గంటలో అమెరికన్ ఆస్పత్రిలో చేర్పించారు. సరిగా టైముకి తీసుకు వచ్చారని, ఇంకాస్త ఆలస్యంచేస్తే ఇబ్బందే అయేదని చెప్పాడు డాక్టర్. ఏవో ఇంజక్షన్లు ఇచ్చాడు. ఓ పది హేను రోజులయినా ఆస్పత్రిలో వుండి విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు."

స్నానం చేసి కొద్దిగా టిఫిన్ తిని చంద్రవదన్, శైలజ మళ్ళీ విజయవాడ వెళ్ళారు. సరాసరి అమెరికన్ ఆస్పత్రికి వెళ్ళారు.

తండ్రిని చూడగానే శైలజ బావురుమంది. ఆయనకి కూడా కళ్ళలో నీళ్ళు తిరిగినా నవ్వుతూనే వున్నాడు.

"ఎన్ని రోజుల నుంచి రమ్మని రాస్తున్నాను మిమ్మల్ని చూడాలని ? ఇదీ ఒకందుకు మంచిదే. ఈ వంకనైనా మీరు వచ్చారు. చూడగలిగాను" అన్నాడాయన సంతోషంగా.

"ఇప్పుడెలా వుంది మామయ్యా?" అడిగాడు చంద్రవదన్.

"బ్రహ్మాండంగా వుంది. కానీ చుట్ట తాగనివ్వటం లేదు. అదే ఇబ్బందిగా వుంది."

"అదసలు గుండె జబ్బు వున్న వాళ్ళకి మంచిది కాదు" చెప్పాడు చంద్రవదన్.

"నిజమే! కాని పాతికేళ్ళ అలవాటు. ఎలా మానడం ఇప్పుడు?"

"ఎలాగయినా ప్రయత్నించి ఆపేయాలి. ప్రాణం ముఖ్యమా లేక వెధవ చుట్టలు ముఖ్యమా ?" దుఃఖంతో కూడిన కోపంతో అన్నది శివరామయ్య భార్య.

"నీకు తెలీదుటే నేను అవి తాగకుండా వుండలేనని ?" నవ్వాడాయన.

"ఇంటికి తీసుకెళ్ళాలంటే భయంగా వుంది. మళ్ళీ ఎక్కడ అవి మొదలుపెడతారోనని" అన్నది అవిత.

"ఎప్పుడొచ్చారు ?" అడిగాడు శివరామయ్య మేనల్లుడిని.

"పొద్దున్నే వచ్చాం" చెప్పాడు చంద్రవదన్.

"ఎలా వుంది అక్కడ ?"

"బానే వుంది.... త్వరలో న్యూయార్క్ నించి నేష్విల్ కి వెళ్ళిపోతాం వేరే యూనివర్సిటీకి ఆఫర్ వచ్చింది నాకు."

"అమెరికాలో వున్నంతకాలం ఆ దేశంలో ఏ ప్రదేశంలో వున్నా ఒకటే. పెద్ద తేడా వుండదు మాకు" పెద్దగా నిట్టూర్చి చెప్పాడు శివరామయ్య.

శైలజ, చంద్రవదన్ మాట్లాడకుండా మౌనంగా వుండిపోయారు.

చంద్రవదన్ శివరామయ్యకి చికిత్స చేసిన డాక్టర్ దగ్గరకి వెళ్ళాడు. అతనూ అమెరికానించి వచ్చిన వ్యక్తే ! చంద్రవదన్ అమెరికాలో వుంటున్నాడని తెలిశాక ఆ డాక్టర్ కి అతనిమీద అభిమానం ఏర్పడింది వెంటనే.

శివరామయ్య రక్తంలో కొలెస్ట్రాల్ ప్రమాదకరమయిన స్థితికి పెరిగిందనీ, ఈసారి బ్రతకటమే అదృష్టం అనీ మరోసారి ఎటాక్ వస్తే ఎవరూ ఏం చేయలేరనీ స్పష్టంగా చెప్పాడు.

అరగంట దాకా చంద్రవదన్ ఆ డాక్టర్ గదిలోనే కూర్చున్నాడు ఆయనతో మాట్లాడుతూ.

తర్వాత శివరామయ్య వుండే స్పెషల్ రూమ్‌కి వెళ్ళాడు. సాయంత్రం దాకా మాట్లాడుతూ అక్కడే వున్నారు ఇద్దరూ. చీకటి పడుతూండగా చెప్పాడు శివరామయ్య-

"ఇంక ముదునూరు వెళ్ళండి. రేపు ఉదయం రండి మళ్ళీ."

శైలజ చెల్లెలు పిల్లకి బిస్కట్లు కొనుక్కుని ఇంటికి చేరుకున్నారు ఇద్దరూ. ప్రయాణంలో అలసిపోవటంవల్ల ఇద్దరూ త్వరగా పడుకున్నారు ఆ రాత్రి.

మర్నాడు ఉదయం విజయవాడ వెళ్ళారు. రోజూ వెళ్ళి రాసాగారు. పన్నెండు రోజుల తర్వాత డిస్‌చార్జ్ చేశారు ఆయన్ని. టేక్సీలో ఇంటికి తీసుకు వచ్చారు.

ఆ రోజంతా అనేకమంది. వచ్చి చూసి వెళ్ళారు ఆయన్ని వూళ్ళో వాళ్ళు. ఆయనకి సంతోషంగా వుంది తన ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులూ తన దగ్గరే వున్నందుకు. రోజూ శ్రద్ధగా టైంకి శైలజ మందులు ఇస్తూంది తండ్రికి. సాయంత్రం చంద్రవదన్ మామయ్యని తనతో బయట వాకింగ్‌కి తీసుకెళ్తాడు. ఉదయం అయిదున్నరకి లేపి శివ రామయ్యని వాకింగ్‌కి తీసుకెళ్తాడు ఓ గంటసేపు, ఆయన విసుక్కున్నా.

దాదాపు మూడువారాలయ్యాయి చంద్రవదన్, శైలజ అమెరికానించి వచ్చి. ఇంకో వారం రోజులే శెలవు. ఆ తర్వాత బయల్దేరాలి.

క్రమంగా శైలజలో మళ్ళీ దిగులు చోటు చేసుకోసాగింది. కూతురి దిగులు శివరామయ్యకి కూడా అర్ధమయింది. మాట్లాడుతూ మాట్లాడుతూ

అకస్మాత్తుగా ఆగిపోతుంది. తండ్రి మొహంలోకి చూస్తూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుంది.

వాళ్లు బయలుదేరే రోజు వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలకి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో హైద్రాబాద్ చేరుకుని అక్కడనుంచి బోంబే వెళ్తారు. సరాసరి వెళ్ళే కంపార్ట్‌మెంటల్‌లో.

అంటే మధునూరు నుంచి పన్నెండింటికయినా బయలుదేరాలి. పదిన్నరకి శైలజ తల్లి అందరికీ అన్నం వడ్డించింది. శైలజ,చంద్రవదన్ శివరామయ్య సరీగ్గా భోజనం చేయనే లేదు.

బయలుదేరే వేళయింది. టేక్సీ వచ్చింది. శైలజ బలవంతంగా అంతదాకా ఆణచుకుంటోంది వచ్చే ఏడుపుని.

వెళ్ళొస్తాను అన్నట్లు తండ్రి కళ్ళలోకి చూసింది. ఆ చూపుకి వున్న భాషని చదివిన శివరామయ్యకి కళ్ళలో నీళ్లు తిరిగాయి. శైలజ ఇక తన ఏడుపుని కంట్రోల్ చేసుకోలేకపోయింది.

తండ్రిని కౌగిలించుకుని ఏడవసాగింది.

"ఇంకెప్పుడూ నిన్ను చూడలేనేమో" అన్నది.

"నాకు అలాగే రాసి పెట్టి వుంటే అంతే జరుగుతుంది" అన్నాడు శివరామయ్య వణికే కంఠంతో.

శైలజ చెల్లెల్ని దగ్గరకు తీసుకుని చెప్పింది.

చెల్లాయ్! నాన్నకి నేను, నువ్వూ ఇద్దరం నువ్వొక్కదానివే. నా తరఫున కూడా నాన్నని నువ్వే చూసుకోవాలి జాగ్రత్తగా."

శైలజ చెల్లెలు కూడా ఏడవసాగింది.

"పద."

నోటిదాకా వచ్చినా తమాయించుకుని ఆగాడు చంద్రవదన్ ఆ పదం అనకుండా. అతనికి తెలుసు ఒకసారి టేక్సీలో ఎక్కితే, అది కదిలితే ఇక కొన్ని సంవత్సరాలదాకా తిరిగి ఇండియా రాలేమనీ, కేవిక్

అంది వచ్చినా ఆయన్ని ప్రాణాలతోనే కాదు, కట్టెగా కూడా చూడలేమనీ. డాక్టర్ చెప్పాడు సంవత్సరం మించి బ్రతకడని పైగాచుట్ట నోట్లో లేకుండా వుండలేడు ఆయన ఇంత జరిగినా.

తమంతట తాము బుద్ధి పుట్టినప్పుడు రావాలనుకున్నా ఎన్నో ఆటంకాలు, ఫార్మాలిటీస్. అన్నివేల మైళ్ళ దూరంనుంచి రావటం కష్టమే.

పద్నాలుగు నెలలలో ఇది రెండోసారి రావటం. పద్నాలుగు నెలలకి రెండోసారి వచ్చింది ఎటాక్. మూడోసారి ఇంకా త్వరగా రావచ్చు.

“ఈ వెధవ శరీరంమీద నాకు తీపి లేదమ్మా! మీరుండగానే ఈ నెల రోజుల్లోనే ఆ దేముడు నా ప్రాణాలు తీసుకుని వుండే బావుండేది. అనవసరంగా వాయిదా వేస్తున్నాడు” శివరామయ్య కళ్ళనీళ్ళు తుడుచుకుని చెప్పాడు.

ఆయన శైలజని నడిపించి తీసుకెళ్ళి టాక్సీలో కూర్చోపెట్టాడు.

“వెళ్ళొస్తా మామయ్యా!”

“జాగ్రత్తగా వెళ్ళండి చేరగానే ఉత్తరం రాయండి.... నిజానికి నాకిప్పుడు చచ్చిపోవాలని వుంది శైలూ!”

టేక్సీలోంచి శైలజ వెనక్కి తిరిగి చూస్తూనే వుంది తండ్రిని, చేతు లూపుతూ. ఆయనా రోడ్డు మీద నిలబడి చేతులూపుతూనే వున్నాడు.

(ఈనాడు తెలుగునాడు సెప్టెంబర్ 1979)